క్లుప్తంగా

సన్మానం



రాయపర్తి : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన గిద్దె సుష్మితను ప్రతిభ చాటి వారణాసిలోని ఐఐటీ కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా టీఎస్‌జీఓస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి కత్తి సోమయ్య, సంయుక్త కార్యదర్శి కత్తి రవీందర్ శుక్రవారం సన్మానించారు. అనంతరం ఆమెకు విద్యాభ్యాసం కోసం రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గట్టు నర్సింహాచార్యులు, తోట సోమనర్సయ్య, చందు విష్ణుమూర్తి, కనుసోతు శ్రీను, కనుసోతు సజ్జన్, వెంకన్న, గౌరారపు దేవేందర్, సంకినేని నవీన్, చెవునబోయిన సమ్మయ్య, గిద్దె సాయిలు, గిద్దె యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి..



నర్సంపేట : బీఆర్ఎస్ పార్టీ చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్నను అమీనాబాద్‌లోని ఆయన నివాసంలో లింగగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పరకాల రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీను, ఉపాధ్యక్షుడు పాలకుర్తి వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యులు మంద యాకాంబ్రం, ముదిరాజ్ సంఘం లింగగిరి సొసైటీ చైర్మన్ సదబోయిన రాజు, యూత్ మండల కార్యదర్శి దాసరి రాము, లింగగిరి యూత్ అధ్యక్షుడు గట్టు విష్ణు, పార్టీ సభ్యులు కనుకుల అనిల్, రాజు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



దుగ్గొండి : గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముస్కు రాజు, ఉపాధ్యక్షుడిగా పోలోజు రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వేముల భగవాన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపాక రాజేందర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజు మాట్లాడారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు పని భారం పెరిగినా వేతనం పెరగలేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఖానాపురం : విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని మనుబోతులగడ్డలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాలరాజు సాకుతున్న ఎద్దు మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.30 వేలు ఉంటుందని బాలరాజు వాపోయాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఎద్దు మృతి చెందిందని బాధిత రైతు, గ్రామస్తులు ఆందోళన వెలిబుచ్చారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌కు చెందిన చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ ఎర్రబెల్లి నిర్మాలదేవి గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ నాయకులు కర్నె రవీందర్, తదితరులు వేర్వేరుగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలికి..



నర్సంపేట : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఠాగూర్ బంగారమ్మ(82) గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యాంకుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, నాయకులు దూదిమట్ల మల్లికార్జున్, రామగిరి రవి, రాచకట్ల రవి, నూనె రంజిత్ కుమార్, పిట్టల సురేందర్, ఆవుల పృథ్వీరాజ్ యాదవ్, దూదిమట్ల దూడయ్య, శ్యాంకుమార్, డ్యాగల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి రోడ్డు అధ్వానం

● గుంతలతో రోగులు, ప్రజలకు ఇబ్బంది



నీరు నిలిచి గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి

నర్సంపేట రూరల్ : పట్టణంలోని సర్వాపురం శివారులోని సుమారు పది ఎకరాల భూమిలో ప్రభుత్వం నిర్మించిన పెద్దాస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఆస్పత్రికి వెళ్లే రోగులు, అటెండెంట్లతోపాటు ఈ రోడ్డు మీద ప్రయాణించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి ప్రారంభానికి ముందే రోడ్డు నిర్మించాలన్న నాటి జిల్లా కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు కాగా ఆర్నెళ్ల క్రితమే రోడ్డు మంజూరైందని, సుమారు రూ.50 లక్షలు మంజూరయ్యాయన్న ప్రచారం సాగుతున్నా పనుల జాడ కనిపించడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ శివారులో ప్రభుత్వం సువిశాల ప్రదేశంలో ప్రభుత్వం ఆస్పత్రితోపాటు మెడికల్, నర్సింగ్ కళాశాలను ప్రభుత్వం నిర్మించిన విషయం తెలిసిందే. మరో బ్లాక్ నిర్మాణంలో ఉంది. భవనాల నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఓపీ సేవలు మాత్రమే అందిస్తున్నారు. మెడికల్, పారా మెడికల్ కళాశాలలు నడుస్తున్నాయి. ఆస్పత్రికి రోజూ ఓపీ సేవల కోసం సుమారు 300–400 మంది వస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కాగా ఆస్పత్రికి, మెడికల్ కాలేజీకి వెళ్లే రోడ్డు సుమారు 800–900 మీటర్ల మేరకు గుంతలమయంగా మారింది. ఇటీవల కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండగా గుంతల్లో నీరు చేరి ఆస్పత్రికి వెళ్లే రోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. ఆస్పత్రి ప్రారంభం కాక ముందే రోడ్డు నిర్మించాలని నాటి జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించిన విషయం బహిరంగ రహస్యమే. ఆస్పత్రి ప్రారంభించి ఏడాది గడిచినా రోడ్డు నిర్మాణ విషయం ముందుకు సాగడం లేదు. ఇదిలా ఉండగా ఆర్నెళ్ల క్రితమే రోడ్డు మంజూరైందని, సుమారు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ సాగుతోందన్న ప్రచారం జరుగుతున్నా ఆ దిశగా కార్యాచరణ చేపట్టిన దాఖలాల్లేవు.

ఇబ్బంది పడుతున్నాం

ఆస్పత్రికి రోగులకు తీసుకురావాలంటే ఇబ్బంది పడుతున్నాం. నర్సంపేట నుంచి పాకాల రోడ్డుకు వచ్చే రహదారి బాగానే ఉన్నా పాకాల్ రోడ్డు నుంచి ఆస్పత్రికి వచ్చే రోడ్డు మొత్తం గుంతలమయమైంది. గుంతల్లో ప్రయాణించాలంటే రోగులూ ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయి.

– రామగిరి యాకయ్య, ఆటోడ్రైవర్

ప్రమాదాల బారిన పడుతున్నాం

ఆస్పత్రికి వాహనాలపై వెళ్లే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బంది ఉంది. కొన్ని సార్లు వాహనాలు గుంతల్లో పడిపోయి అదే ఆస్పత్రి అడ్మిట్ అయి చికిత్స చేయించుకుంటున్న పరిస్థితి నెలకొంటోంది. వెంటనే రోడ్డు నిర్మించాలి.

– గొర్రె అజయ్, మాదన్నపేట వాసి

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రేషన్‌కార్డు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : రాష్ట్రంలోని పేదల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఆశాలపల్లిలోని కూచన గార్డెన్స్‌లో శుక్రవారం శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు లబ్ధిదారులకు ఆయన రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు రేషన్‌కార్డులు సైతం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోందని, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికాయుతంగా కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మహిళల అభ్యున్నతి కోసం పాల డెయిరీ, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

పర్వతగిరి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ ఉద్యమాలు నిర్మిస్తోందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా యూనియన్ చొరవ తీసుకుంటుందని తెలిపారు. యూనియన్‌ను మండలంలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భూక్య రాములు, ప్రధాన కార్యదర్శి మేడిది నాగేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొనుగోటి అశోక్, పీఆర్‌టీయూ పత్రిక సంపాదక మాజీ కార్యవర్గ సభ్యుడు ఎస్‌వీఆర్.రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి అక్రమ తరలింపు

● కట్టడిలో అధికారుల నిర్లక్ష్యం..!



పెద్దచెరువు మట్టిని ట్రాక్టర్‌లో పోస్తున్న హిటాచీ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని పెద్ద చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుకు సుమారు రూ.1000–1500 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐబీ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అక్రమానికి అడ్డుకట్ట వేయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయకట్టు రైతులు, మండల ప్రజలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పెద్ద చెరువులో కొందరు వ్యక్తులు కొద్ది రోజులుగా హిటాచీ సాయంతో అక్రమంగా తవ్వకాలు చేపడుతూ మట్టిని ట్రాక్టర్లలో యదేచ్ఛగా బయటకు తరలిస్తున్నారు. దీంతో చెరువు మొత్తం గుంతలమయంగా మారుతోంది. వర్షాకాలం నేపథ్యంలో చెరువు మొత్తం నీటితో నిండితే లోతు తెలియక చెరువులోకి దిగితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు, ఆయకట్టు రైతులు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమంగా తరలింపును అడ్డుకోవడంతోపాటు అక్రమార్కులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

● ఎంపీటీసీ–2 ఇన్‌చార్జ్ కొమ్ము రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నెక్కొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ–2 ఇన్‌చార్జి కొమ్ము రమే శ్‌యాదవ్ కోరారు. మండల కేంద్రంలోని బొడ్రాయి సమీపంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి 19 నెలలుగా హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు తోట సాంబయ్య, బొడ్డపల్లి రాజు, షాద సరితారెడ్డి, గంద్రకోటి నరేందర్, రాపాక లచ్చులు, బండి వెంకటేశ్వర్లు, లెంకపెల్లి కుమార్, బోడ రాజు, బండి యాదమ్మ, కక్కెర్ల శ్రీధర్, రామారపు రమ, తదితరులు పాల్గొన్నారు.

షూ, టై, బెల్టుల పంపిణీ



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్వవిద్యార్థి, మాజీ ఎంపీపీ డాక్టర్ బానోతు సారంగపాణి శుక్రవారం తన సొంత డబ్బుతో సమకూర్చిన షూ, టై, బెల్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ గుండెబోయిన సదానందం, మాజీ ఎంపీటీసీ ఓడెల రవి, నాయకులు రాంబాబు, శివ, తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రాయపర్తి : అంబేడ్కర్ సంఘం జిల్లా కోకన్వీనర్‌గా మండలంలోని కాట్రపల్లికి చెందిన బూడిద రామ్మూర్తి నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య శుక్రవారం నియామక పత్రం అందజేశారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడారు. మండలంలో సంఘం బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలివ్వాలి



నర్సంపేట రూరల్ : గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రతినెలా గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలివ్వాలని కోరుతూ ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మర్ధ నరేశ్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నరేశ్ మాట్లాడారు. కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ నాయకులు సంతోశ్, అఫ్రోజ్, సతీశ్, రాజేశ్, సందీప్, శ్రీను, షబానా, స్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఈరగాని విమల ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. తొలుత విమల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ షబీర్, రాపోలు యాకయ్య, బుర్ర యాకయ్య, బాషుమియా, పాషా, షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : రైతులను, ఆదివాసీలను నిలువుదోపిడీ చేస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్య తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డీ వ్యాపారుల వలలో చిక్కిన వారు బయటకు రాలేక చివరకు ఉన్న భూములను అమ్ముకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు, యూరియా, పురుగు మందులను వడ్డీ వ్యాపారులే విక్రయిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన వాటికి బిల్లులు ఇవ్వకపోవడంతో పంట నష్టపరిహారాన్ని అడిగే హక్కు రైతులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. నాయకులు మల్లన్న, భద్రాజీ, ప్రదీప్, రాజేందర్, అజయ్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో శాశ్వత పరిష్కారం

● వైద్యురాలు పర్వీన్ మీనాజ్ బేగం



మాట్లాడుతున్న అధ్యక్షుడు సత్యనారాయణ

నర్సంపేట : పలు వ్యాధులకు ఆయుర్వేద వైద్యంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు పర్వీన్ మీనాజ్ బేగం తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం చెన్నారావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసిద్ధేశ్వర ఆలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం పునాతన కాలం నుంచి ప్రాచుర్యంలో ఉందన్నారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ మాట్లాడారు. వృద్ధులు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, నాయకులు కుమారస్వామి, చందుల కృష్ణమూర్తి, తాళ్లపల్లి కొమ్మాలు, వరంగంటి మల్లయ్య, గట్ల కృష్ణ, ముత్యం సాంబయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ



ఖానాపురం : గోదాము వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

ఖానాపురం : మండలంలోని ఖానాపురం, అశోక్‌నగర్ గ్రామాల్లో రైతులు యూరియా కోసం శుక్రవారం బారులు తీరారు. ఆయా సొసైటీలకు దొడ్డు రకం యూరియా చేరుకోవడంతో సంబంధిత గోదాముల వద్ద ఉదయం నుంచే రైతులు క్యూ కట్టారు. రెండు సొసైటీలకు 444 బస్తా చొప్పున యూరియా రాగా ఒక్కో రైతుకు మూడు బస్తాల చొప్పున అందించనున్నట్టు ఏఓ శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ బందోబస్తు నడుమ యూరియా పంపిణీ చేస్తామని ఏఓ చెప్పారు. యూరియా కొరత లేదని, రైతులందరికీ తప్పకుండా యూరియా అందజేస్తామని ఆయన తెలిపారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం

నల్లబెల్లి : రైతులందరికీ యూరియా అందిస్తామని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బన్న రజిత తెలిపారు. మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. కన్నారావుపేట, నల్లబెల్లి, రంగాపురం, రేలకుంట, శనిగరంల్లోని షాపుల్లోనే కాకుండా రుద్రగూడెంలోని ఆగ్రోస్ ఏజెన్సీలో యూరియా బస్తాలున్నాయని చెప్పారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుతో వెళ్లి యూరియా తీసుకోవాలని కోరారు. ఆంక్షల్లేకుండానే యూరియా అందిస్తారని చెప్పారు. షాపుల యజమానులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా దాశరథి శతజయంతి



మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అధ్యక్షతన ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చక్రవర్తుల వరంగల్‌కు చెందిన రాధకృష్ణ సాహితీ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల విద్యాధికారి (ఎంఈఓ) రత్నమాల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. దాశరథి కృష్ణమాచార్యను గొప్ప కవిగా అభివర్ణించారు. నేటితరం యువ కవులకు స్ఫూర్తిప్రదాతగా తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు గ్రామంలో జన్మించి అంచెలంచెలుగా గొప్ప కవిగా ఎదిగారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రంజిత్‌కుమార్, భవాని, జ్యోతి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు ఉత్సవం సంస్కృతికి చిహ్నం



అరచేతుల్లో గోరింటాకుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

● జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జయ

నర్సంపేట : గోరింటాకు ఉత్సవం సంస్కృతికి చిహ్నమని చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. ఆ స్కూల్‌లో విద్యార్థులు శుక్రవారం ఆషాడమాస గోరింటాకు ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు అరచేతులను గోరింటాకు అలంకరించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ తరాలకు వారధులన్నారు. గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఉత్సవాలతో సంస్కృతి, విలువలు దశదిశలా వ్యాపిస్తాయన్నారు. గ్రామీణ జీవితం, సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా గోరింటాకు ఉత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ్ సునీత, సీహెచ్.మాధవి, కె.మాధవి, రమాదేవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్



సభ్యత్వం ఇస్తున్న అధ్యక్షుడు కుమార్

నల్లబెల్లి : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని నారక్కపేట, రుద్రగూడెం, రంగాపురం, నందిగామ, నల్లబెల్లి ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన వివిధ బకాయిలు అందించాలన్నారు. నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మర్రి అన్నాదేవి మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయినులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, కేర్ టేకర్‌ను నియమించాలన్నారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునఃరుద్ధరించాలని ఆమె కోరారు. సంఘం కోశాధికారి ఎస్‌ఏ రవూఫ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కత్తి కుమారస్వామి, ఎడవల్లి రాజిరెడ్డి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.